www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 16 మార్చి 2024 5 తూర్పుగోదావరి

ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక ఆల్కట్ గార్డెన్స్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామీణ యువకులకు ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌లో ఉచిత శిక్షణతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. ఈ కోర్సుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులు మాత్రమే అర్హులని సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాస్టల్ వసతి మరియు భోజనం వసతి కల్పిస్తామన్నారు. కోర్సు పూర్తయిన తరువాత సర్టిఫికెట్‌తో పాటు ఎవరైనా సొంతంగా బిజినెస్ పెట్టుకునే వారికి లోన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. వివరాలకు 7780599939, 9014328803, 0883-2428807 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కూటమిలో కుమ్ములాటలు

- పవన్ పోటీపై భగ్గుమంటున్న పిఠాపురం టిడిపి శ్రేణులు
- కొవ్వూరులో జవహర్ వర్గం ప్రత్యేక కుంపటి
- ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచే యోచనలో నేతలు?
- జగ్గంపేటలో జ్యోతులకు పోటీగా జనసేన ఇన్‌ఛార్జ్
- కాకినాడ రూరల్ టిడిపిలోనూ అసంతృప్తి సెగలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికల వేళ విపక్ష కూటమిలో కుమ్ములాటలు తారాస్థాయికి చేరుతున్నాయి. పొత్తు ధర్మాన్ని పాటించేలా ముందుకు వెళుతున్నామని టిడిపి, జనసేన అధినేతలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కానరావట్లేదు. ఆయా పార్టీల నేతలు, కార్యకర్తల మధ్య విబేధాలు భగ్గుమంటున్నాయి. టికెట్ ఆశించి భంగపడిన నేతలంతా అధిష్టానం నిర్ణయాన్ని బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. తమ బలం ఏమిటన్నది వచ్చే ఎన్నికల్లో తప్పకుండా నిరూపిస్తామంటూ పొత్తు ధర్మాన్ని పక్కనపెట్టి పోటీకి సై అంటున్నారు. ఆ పార్టీల అధిష్టానాలకు ఈ వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారింది. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ప్రభావం పడుతుందో అనే ఆందోళన వారిలో మొదలైంది.

పిఠాపురం నుంచి తాను పోటీలో ఉంటున్నానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించడంతో ఇక్కడ టికెట్ ఆశించి నిరాశ చెందిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఆ పార్టీ అధికార ప్రతినిధి ఎస్‌విఎస్‌ఎన్.వర్మ గ్రూపు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అధిష్టానం తీరుకు నిరసనగా టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండాలను వర్మ కేడర్ తగులబెట్టి నిరసన తెలిపింది. చంద్రబాబు, లోకేష్‌తో సహా పవన్‌కళ్యాణ్‌పై వారు విరుచుకుపడ్డారు. రెండు దశాబ్దాలుగా కుటుంబాన్ని, వ్యాపారాలను పక్కన బెట్టి పార్టీని ముందుకు తీసుకెళ్తున్న వర్మకు కాకుండా పవన్‌కళ్యాణ్‌కు టికెట్ కేటాయించడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల అభీష్టం మేరకు తాను భవిష్యత్తు కార్యాచరణను తెలియజేస్తానని వర్మ ప్రకటించారు. శుక్రవారం తన ముఖ్య అనుచరులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఏదేమైనా బరిలో నిలుచునే తీరాలంటూ అనుచరులు వర్మపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే లోకల్, నాన్ లోకల్ అంటూ ప్రచారం మొదలుపెట్టారు. 'పిలిస్తే పలికేవాడు స్థానికుడికే నా ఓటు' అంటూ ఎటువంటి రాజకీయ రంగులు లేకుండా నియోజకవర్గం అంతా భారీ స్థాయిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నాన్ లోకల్ అంటూ పరోక్షంగా పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించే ఇవి వెలిసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై సోషల్ మీడియాలో జనసైనికులు కూడా పోస్టింగులు పెడుతున్నారు. ఇదిలా ఉండగా టిడిపి అధినేత చంద్రబాబు నుంచి పిలుపు రావడంతో అనుచరుల నిర్ణయాన్ని అధినేత ముందు వర్మ పెట్టనున్నారు. తాజా పరిణామాలను పరిశీలిస్తే వర్మ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పవన్‌ను సీటు కేటాయించడానికి నిరసనగా పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, వర్మ అభిమానులు

మరోవైపు కొవ్వూరు నియోజకవర్గ టిక్కెట్‌ను ఆశిస్తున్న మాజీ మంత్రి జవహర్‌కు చుక్కెదురైంది. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన అనుచరులు టిడిపి ఫ్లెక్సీలను చించేసి నిరసన తెలిపారు. శుక్రవారం అనుచరులతో సమావేశమై ఏదేమైనా తాను ఎన్నికల బరిలో ఉంటానని తెగేసి చెప్పారు. ఎన్నికల నాటికి బిఫామ్ తనకే వస్తుందనే దీమాను వ్యక్తం చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలోనూ కూటమిలో కుమ్ములాటలు తప్పడం లేదు. పొత్తులో భాగంగా టిడిపి నేత జ్యోతుల నెహ్రూకి టికెట్‌కు దక్కడంతో అక్కడ జనసేన ఇన్చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర అసంతృప్తికి లోనయ్యారు. నాలుగు రోజుల పాటు నిరాహార దీక్ష సైతం చేశారు. చివరికి అధిష్టానం కూడా స్పందించకపోవడంతో తాను స్వతంత్రంగా అయినా పోటీ చేస్తానని ప్రకటించారు.. దానిలో భాగంగానే 15 రోజులుగా నియోజకవర్గంలో ఆయన పర్యటనలను విస్తృతం చేశారు. ఇంత జరుగుతున్నా నేటి వరకూ నెహ్రూ సూర్యచంద్రని కలిసి మద్దతు కోరకపోవడంతో ఇక్కడ పోటీ తప్పదనేది స్పష్టం అవుతుది. సూర్యచంద్ర బరిలో ఉంటే జనసేన ఓట్లు టిడిపికి బదిలీ అయ్యే అవకాశం కనిపించడం లేదు.

కాకినాడ రూరల్ సీటుని జనసేన నేత పంతం నానాజీకి కేటాయించారు. ఈ సీటును మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి ఆమె భర్త సత్యనారాయణమూర్తి ఆశిస్తున్నారు. బిసి సామాజిక వర్గ ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఉండడంతో తమకే టిక్కెట్ వస్తుందనే ఆశతో ఉండగా అధిష్టానం షాక్ ఇచ్చింది. మొదట్లో వ్యతిరేకత చూపించినా తరువాత జనసేకు మద్దతు ఇస్తామని వారు ప్రకటించారు. అయినప్పటికీ రానున్న కాలంలో ఎటువంటి విబేధాలు బయటపడతాయోనే చర్చ జరుగుతుంది. మరోవైపు చంద్రబాబు తనకు అన్యాయం చేశారంటూ రూరల్ నియోజకవర్గానికి చెందిన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా ఆవేదన వ్యక్తం చేశారు. తనకు చరిష్మా లేదని చంద్రబాబు చెప్పడం బాదేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా తాను బరిలో ఉంటానని ప్రకటించారు.

తునిలో యనమల దివ్యను ప్రకటించినప్పటికీ ఆమె చిన్నాన్న, టిడిపి సీనియర్ నేత కష్ణుడు, అతను వర్గాన్ని పట్టించుకోకుండానే దివ్య ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో గుర్రుగా ఉన్న కష్ణుడు వర్గం టిడిపి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వైసిపిలో చేరతారంటూ ప్రచారం జరిగింది.అయితే పార్టీ మారే ప్రసక్తి లేదంటూ కృష్ణుడు విలేకరుల సమావేశంలో తాజాగా ఖండించారు. ప్రత్తిపాడులో వరపుల సత్యప్రభకు రెండో జాబితాలో టిక్కెట్టును కన్ఫర్మ్ చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో బీసీలు అధిక సంఖ్యలో ఉండటంతో బీసీ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించాలంటూ టిడిపి నాయకుడు పైలబోసు కొంతకాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు. అధిష్టానానికి కూడా ఫిర్యాదులు చేశారు. దీంతో సత్య ప్రభ సొంత పార్టీలోనే వర్గ పోరును ఎదుర్కొంటుంది.



చర్చావేదికలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

వినియోగదారుల హక్కుల రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వినియోగదారుల రక్షణ అందరి బాధ్యత అని జెసి తేజ్ భరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ డిఎస్‌ఒ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా 'వినియోగదారుల కొరకు న్యాయమైన మరియు బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు' అనే అంశంపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి తేజ్ భరత్ మాట్లాడుతూ, వినియోగదారుల్లో అవగాహన కల్పించడం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రస్తుత తరుణంలో వినియోగదారులు న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు(ఎఐ)ను జాగరుకతతో వినియోగించుకోవాలన్నారు. వినియోగ దారులు మోసపోకుండా ఉండేందుకు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజల్లోకి వినియోగ దారులు హక్కులు, ప్రయోజనాలు పై విస్తత స్థాయిలో ప్రచారము కలుగ చేసేందుకు కార్యచరణ సిద్దం చెయ్యాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.విజయభాస్కర్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ, స్వామినాథన్, హరిబాబు, స్టూడెంట్స్ కన్జూమర్ క్లబ్స్ మాస్టర్ ట్రైనీస్, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు, విజిలెన్స్ సభ్యులు, కన్జ్యూమర్ వాలంటరీ ఆర్గనైజర్స్, చౌక ధరల దుకాణ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అంశాలపై ఎస్‌ఆర్‌టి సనైస్ టెక్ ఐకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో టెక్నాలజీ యొక్క ఆవశ్యకత ఎంతో పెరిగిందన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలు అందరికీ అవసరమని తెలిపారు. ఆదికవి నన్నయ విద్యాలయంలోని అధ్యాపకులు అందరికీ సాంకేతిక ప్రగతిని పెంపొందించాలనే ఆలోచనతో వీసీ ఆచార్య కె.పద్మరాజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. సంస్థ సిఇఒ ఎస్‌విడి రవితేజ, వెంకట భమిడిపాటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రాధాన్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రిసోర్స్ పర్సన్స్‌కు రిజిస్ట్రార్ సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ టి.హైమావతి యూనివర్సిటీ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - గోపాలపురం

ఇల్లు లేని ప్రతి పేదవానికి సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి అన్నారు. భీమోలు గ్రామంలోని రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను 29 మంది లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. ప్రతి పేదవానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు పట్టాలు అందించిన జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ సూర్యారావు, దుంపల రాంపండు, లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో ధైర్యం నింపేందుకే పోలీసు కవాతు

ప్రజాశక్తి - చాగల్లు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా, ప్రజల్లో ధైర్యం నింపేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి శుక్రవారం సాయంత్రం పోలీసు కవాతు నిర్వహించారు. కొవ్వూరు రూరల్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంల్లో ధారవరం, మల్లవరం, చంద్రవరం, గౌరుపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చాగల్లు ఎస్‌ఐ పి.నాగరాజు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని. దానికి పోలీసు సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తామన్నారు

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - గోపాలపురం

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివద్ధి అందించడం జగనన్నతోనే సాధ్యమని హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం కోమటిగుంట గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో వైసిపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తానేటి వనితోపాటూ వైసిపి రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి గూడూరి శ్రీనివారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడారు. గత ప్రభుత్వం హామీలను విస్మరించిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందని గుర్తు చేశారు. ప్రజలు సంతోషంగా ఉన్నారంటే జగనన్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. ఇలాగే సంతోషంగా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైసిపిని గెలిపించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధి సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై నిందలు వేస్తున్నాయని విమర్శించారు. అనంతరం గ్రామంలో దళిత కాలనీలో సిసి రోడ్డును ప్రారంభించారు. కోమటికుంటలో హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. జగనన్న కాలనీలో బోరు పనులకు శంకుస్థాపన చేవారు. సర్పంచ్ ప్రమీల కుమారి, వెలగా శ్రీరామమూర్తి దంపతులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామంలో కొన్ని వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాని పేదలకు ఇప్పించాలన్నారు. గ్రామంలో స్కూల్ సమస్యను, కట్టుకున్న ఇళ్లకు బిల్లులను చెల్లించేలా చూడాలన్నారు. మంత్రి మాట్లాడుతూ అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురుకూరి నాగేశ్వరరావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, సర్పంచులు కురుకూరి ధనలక్ష్మి, అన్సర్ భాషా, ఇళ్ల శ్రీరామ్మూర్తి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - కడియం

జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అచ్యుత్‌రాజు, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, కడియం, అనపర్తి మండలాల్లో పలు మండలాల్లోని వరి, కూరగాయలు పంటలను క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ద్వారకాదేవి గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత దాల్వా వరి పంట ఈనిక దశ నుండి గింజ పాలు పోసుకునే దశలో ఉందని పెద్దగా చీడ పీడ ఉధత లేదని దిగుబడి ఆశాజనకంగా ఉన్నాయన్నారు. అక్కడక్కడ కాండం తొలిచే పురుగు ఆకు మడత పురుగు గమనించామన్నారు నివారణకు కార్పస్ హైడ్రోక్లోరిడ్, రెండు గ్రాములు లేదా క్లోరంట్ర నిలి ప్రొల్ 0.3 మిల్లీ లీటర్ల లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు దోమపోటు కనిపిస్తే పురుగుల సంఖ్యను బట్టి పురుగుమందులు వాడాలన్నారు సుడిదోమ ఆశిస్తే ట్రై ఫుల్ మేజో ఫెరిన్ ఎక్సెన్ ఎకరానికి 96 మిల్లీలీటర్ల 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కడియం పరిసర ప్రాంతాలలో సార్వ వరి తర్వాత బంతి సాగు చేసే రైతులతో లాభసాటి పంట సాగు గురించి చర్చించారు అనంతరం కూరగాయల పంటల్లోనూ మిరప బెండ బీర, చీడపురుగుల నివారణకు పలు సూచనలు చేశారు మిరపలో పై ముడతకు కారణమగు తామర పురుగులను నివారణకు, ఫిప్రానిల్ 2 మి.ల్లి ఒక లీటర్ల నీటి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ద్వారకాదేవి, స్థానిక రైతులు వ్యవసాయ అధికారులు కడియం మండల గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజకీయాల్లో వివక్షత తగదు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

రాజకీయాల్లో వివక్షత చూపడం సరైంది కాదని, వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తానని,పార్టీ అధిష్టానం పునరాఆలోచన చేస్తుందనే ఆశిస్తున్నామని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేశానన్నారు. జిల్లా అధ్యక్షుడిగా టిడిపి అభివృద్ధికి కృషి చేశానన్నారు. కొందరు వ్యక్తుల మాటలను పరిగణకు తీసుకుని సీటు కేటాయించకపోవడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గంలో పార్టీని నమ్ముకొని 15 మంది ఆశావాహులు ఉన్నారని, వారిని కాదని పక్క నియోజకవర్గంలో 36 వేల ఓట్ల మెజార్టీతో ఓడిపోయిన వ్యక్తిని కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించడం దురదృష్టకరమన్నారు. పార్టీ క్యాడర్ తో కలిసి మాట్లాడిన అనంతరం నిర్ణయం తెలుపుతామన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ నుంచి వైదొలగండి అంటే తప్ప పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు కార్యకర్తల నిర్ణయాన్ని శిరసా వహించి ముందుకి సాగుతానన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ముప్పిడి రాజు, రాపాక శ్రీను వాస్ తదితరులు ఉన్నారు

నాగమణిని అభినందిస్తున్న వెల్లంపల్లి

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్స్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- గోకవరం

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్స్‌గా ఎంపికైన వారు శుక్రవారం మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్‌గా డాక్టర్ ప్రగల్లపాటి నాగమణి ప్రమాణ స్వీకారం మాజీ మంత్రి శ్రీనివాస్ చేతులు మీదగా చేయించారు. వీరితోపాటు తుమ్మన భాస్కర్, కుమారి, గంట శ్రీనివాస్, మాచారం నాగమణి, భారతి, నూకల మల్లికార్జునరావు, గునిశెట్టి శ్రీనివాసరావు, కంకటాల సత్య నాగ వెంకట రాజ్యలక్ష్మి, గుడపాటి రోజా రమణి, తామర విజయలక్ష్మి, శిరీష, కొట్టారి రంగనాథ సాయి, భవాని, చింత కంట పుల్లయ్య, గూడూరు సత్యనారాయణలకు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపికైన డైరెక్టర్స్ కి వెల్లంపల్లి శ్రీనివాస్, కుప్పం ప్రసాద్, ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ కనకరాజు, జాయింట్ సెక్రెటరీ హారిక, ప్రవల్లిక సంతోష్ గుప్తా ఆర్డినేటర్ పి శ్రీనివాస్,ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు, సుజిని, కామేష్, భార్గవి, పద్మ, వీరస్వామి, రామ్మూర్తి ,సుబ్బారావు, రామకష్ణ, శ్రీరామ్మూర్తి, సతీష్, అభినందనలు తెలిపారు.రైటప్:

పది పరీక్షల కోసం నాలుగు కేంద్రాలు

తాళ్లపూడి : సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ-1 బాలామణి, ఎంఇఒ-2 నెహ్రూజీ తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థుల కోసం మండలంలో తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లిలో ఎ, బి అనే నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ తెలిపారు. 456 మంది ప్రభుత్వ పాఠశాలు 246 మంది ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు కలిపి 702 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షల కోసం 44 మంది ఇన్విజిలేటర్లను ఒక రూట్ ఆఫీసర్‌ను నియమించామని తెలిపారు.

రూ.2.28 కోట్ల అభివృద్ధి పనుల ప్రాతంభం

ప్రజాశక్తి- కడియం.

కడియం మండలంలో రూ.2.28 కోట్లతో చేపట్టి పూర్తి చేసిన వివిధ భవనాలను శుక్రవారం మంత్రి వేణు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజా అవసరాలను గుర్తించి వాటిని అమలు చేసే క్రమంలో పారదర్శకతతో ప్రామాణికంగా తీసుకొని సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లను గ్రామాల్లోనే అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు . మురమండ గ్రామంలో 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.60 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు.అదేవిధంగా జేగురుపాడు గ్రామంలో రూడా నిధులు రు.25 లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ యాక్టివిటీస్ సెంటర్ కు శంకుస్థాపన చేశారు.

కార్టూ'నిజం'

అక్కడ ఆయన చిత్రాల కోసం కోట్లు..
ఇక్కడ ఈయన చిత్రాల కోసం కోట్లు..!!

నమ్మినందుకు నట్టేట ముంచారు

జగన్‌పై ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఐదేళ్ల క్రితం జగన్‌ను నమ్మి అధికారం ఇచ్చినందుకు అందరినీ నట్టేట ముంచాడని, భారాలతో పేదల బతుకు భారం చేశారని టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ పర్యవేక్షణలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాలుగో డివిజన్‌లో శుక్రావరం నిర్వహించారు. టిడిపి నాయకులతో కలిసి డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగునల్నరేళ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలతో సిఎం జగన్ ఆటలు ఆడుకుంటున్నారన్నారు. ఆశావర్కర్స్, మున్సిపాలిటీ, అంగన్‌వాడీలు, ఇలా అందరితో ముఖ్యమంత్రి అడుకుంటున్నారని విమర్శించారు. ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజల సొమ్మును వైసిపి నేతలు దోచుకుంటున్నారన్నారు. 2019కు ముందు ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందుందని, ఇప్పుడు పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావట్లేదని విమర్శించారు. పెరిగిన ధరలు, పన్నులతో సామాన్యుల జీవనం కష్టతరంగా మారిందన్నారు. రాక్షస పాలన సాగిస్తున్న వైపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు శాశ్వతంగా నమ్మబోరని, వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీను, కొండిశెట్టి రామకష్ణ, బొట్టా వీరబాబు, దారా రాజు, మొతికి మురళీకష్ణ, గుత్తుల రమేష్, వెల్లంకి మణికంఠ, కర్రి మహేంద్రవర్మ, అల్లాడి శ్రీరాములు, కొందుర్తి హరీష్ అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీలో పాల్గొన్న ఆదిరెడ్డి వాసు తదితరులు

కలెక్టర్‌ను కలిసిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పశుసంవర్ధకశాఖ అధికారి టి.శ్రీనివాసరావు కలెక్టర్ మాధవీలతను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు గుంటూరు జిల్లా తాడికొండ ఏరియా వెటర్నిటీ ఆసుపత్రిలో సహాయ సంచాలకులుగా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున అమూల్ బల్క్ మిల్క్ యూనిట్స్‌కు పాల వెల్లువ సేకరణ కేంద్రాల ద్వారా పాల సేకరణ లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఆ మేరకు ప్రతి రోజూ ఆయా కేంద్రల నుంచి 160 లీటర్ల మేర పాలను సేకరించాలన్నారు. పాలసేకరణ కేంద్రలను అభివృద్ధి చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డిఎహెచ్‌ఒ డాక్టర్ టి.శ్రీనివాస రావు, కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధక అధికారి జి.రాధాకృష్ణ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

500 కేజీల కోకో గింజలు చోరీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన కొండేపాటి ఫణిప్రసాద్‌కు చెందిన 500 కేజీల కోకో గింజలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ నెల 9న చోరీకి గురయ్యాయని, వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ పి.నాగరాజు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారిపై గూడ్స్ లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొల్లప్రోలుకు చెందిన డి.రాంబాబు(43) బైక్‌పై జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. వైఎస్‌ఆర్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేట్ గూడ్స్ లారీ వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాంబాబు అక్కడికక్కడే మతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మరణం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది పోలీసుల వివరాలు ప్రకారం మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన మేడిది రమేష్ (36) ఇటీవల కాలంలో మద్యానికి బానిసై రోజు భార్యతో గొడవలు పడేవాడు. భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 11న తన పశువుల మకాం వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే తనని రావులపాలెం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించడంతో, చికిత్స పొందుతూ శుక్రవారం మతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

అత్యాచారం చేసిన కేసులో ఐంటుమిల్లి గ్రామానికి చెందిన నిందితుడు గుత్తుల వెంకట కిరణ్‌కు రాజమహేంద్రవరం ఎనిమిదవ జిల్లా అడిషనల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు 11 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు శుక్రవారం కాట్రేనికోన పోలీసు స్టేషన్ ఎస్‌ఐ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కేసును అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు ప్రాసిక్యూషన్ తరుపున వాదన వినిపించారు .2020 మే నెలలో జరిగిన ఈ సంఘటనపై అప్పటి ఎస్‌ఐ సంపత్ కుమార్ కేసు నమోదు చేయగా ముమ్మిడివరం సిఐ రాజశేఖర్ రావు దర్యాప్తుచేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి ఎస్. శ్రీధర్ ఈ సందర్భంగా ఒక ప్రకటనలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్ట పరమైన చర్యలు కఠినంగా ఉంటాయి అని హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి పోలీసు అధికారులను ఎస్‌పి అభినందించారు.

సారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరు గ్రామ శివారులో నాటు విక్రయిస్తున్న వ్యక్తిని అంగర పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం అంగర ఎస్‌ఐ అండే పరదేశి తెలిపిన వివరాల ప్రకారం ఇలా... గురువారం రాత్రి తమకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేయగా వల్లూరు గ్రామానికి చెందిన వానపల్లి వెంకన్న నుంచి రూ.900 విలువ చేసే మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-యు. కొత్తపల్లి

కొనపాపేట హేచరీలో ఒక యువకుడు అర్ధరాత్రి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తొండంగి మండలం ఎ.వి.నగరానికి చెందిన పోలవరపు రాజు (29) బ్లూఫార్మ్ హేచరీలో కొంతకాలంగా సూపర్‌వైజరుగా పని చేస్తున్నాడు. తాను ఉంటున్న రూమ్ లోనే ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు ప్రియురాలికి వీడియో కాల్ చేసి క్షణికావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని బంధువులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనం

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పాత సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వద్ద అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పిడిఎస్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఎంఎస్‌ఒ కీర్తి సమాచారం ప్రకారం సామర్లకోట పట్టణ సమీపంలో లారీ శేషిలాల్ వ్యాన్‌లో 4,357 కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యంను తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం మండలంలోని సుజాతనగర్‌కి చెందిన వాహన యజమాని ఎ.పవన్, కొత్తగూడెం హేమచంద్రపురంనకు చెందిన డ్రైవరు చందు, వి.సాయి భరత్ రవాణా చేస్తున్నారు. రూ.9,98,243 విలువైన బియ్యాన్ని సీజ్ చేసి 6-ఎ కింద కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకట రాజు, లక్ష్మీనారాయణ, సివిల్‌డిటి కీర్తి, విజయకుమార్, జీవానందం, వీఆర్‌ఓ ఏడిద భరత్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

భూమి పూజ చేస్తున్న ఎంఎల్‌ఎ అశోక్

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యానాం

యానాం లోని పలు గ్రామాలలో ఆది ద్రావిడ సంక్షేమ శాఖ, ఎంఎల్‌ఎ నిధులు సుమారు రూ.83.61 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికల మరమ్మతు పనులకు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. బెజవాడ గార్డెన్‌లోని మూడో వీధిలో రూ.14.94 లక్షలు, నాలుగో వీధిలో రూ.20.44 లక్షలతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కురసాంపేట హిందూ శ్మశాన వాటికలో రూ.18.54 లక్షలు, క్రైస్తవ శ్మశాన వాటికలో రూ.4.96 లక్షలతో మరమత్తు పనులకు, మెట్టకూరులోని గణపతినగర్లో రూ.4.68 లక్షలతో రోడ్లు, ఫరంపేట సొసైటీ భూములకు రూ.16.08 లక్షలతో రోడ్లు, అన్యంగార్డెన్లో రూ.3.93 లక్షలతో అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ అశోక్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎఇ కుమార్, చెల్లి గోపి, పోలిశెట్టి ఆదినారాయణ, సిఐ షణ్ముగం, ఎస్‌ఐ నూకరాజు పాల్గొన్నారు.

దాట్ల దేవదానం రాజుకు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - యానాం

దేవదానం రాజు

కవి, కథకుడు, బహు గ్రంథకర్త దాట్ల దేవదానం రాజుకు 'సృజనాత్మక సాహిత్యం' విభాగంలో పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారాన్ని అందిస్తున్నట్లు విసి టి.కిషన్ రావు తెలిపారు. ఈ నెల 20న హైదరాబాదు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దేవదానం రాజు పురస్కారాన్ని స్వీకరిస్తారు. కథలు, కవితలు, చరిత్ర, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియల్లో చేసిన ఆయన కృషిని పరిగణలోకి తీసుకుని ఈ పురస్కారం ప్రకటించారు. దేవదానం రాజు ఏడు కవితాసంపుటులు, ఐదు కథాసంపుటులు, రెండు దీర్ఘకవితలు, చరిత్ర గ్రంథం, నవల, రాజకీయ వ్యంగ్య కథనాలు, చమత్కారాలు పుస్తకాలు రచించారు. కళైమామణి విష్ణుమూర్తి, శిఖామణి, పిఆర్ఎల్.స్వామి, మధునాపంతుల, ముమ్మిడి నాగప్రసాద్, చింతా కొండలరావు, జిమ్మి, రామ్మోహనరావు, డాక్టర్ శివప్రసాద్ దాట్లను అభినందించారు.

పొగాకు రైతుల సంఘ అధ్యక్షునిగా రాంబాబు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం పొగాకు వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడిగా యిల్లూరి రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రైతు నాయకుడు గద్దే శేషగిరి ప్రకటించారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన ఇల్లూరి రాంబాబును ఎన్నుకున్నామన్నారు. ఇప్పటి వరకు అధ్యక్షునిగా ఉన్న పిన్నమనేని మధుమోహన్ నూతన కార్యవర్గ గౌరవ అధ్యక్షునిగా కొనసాగుతారన్నారు. మిగిలిన పాలకవర్గ సభ్యులను త్వరలో ఎన్నుకుంటామని తెలిపారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉండవల్లి సత్య నారాయణ, దుగ్గిరాల రాంబాబు, కూసం మోహన్‌రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పరిమి జగదీష్, నందమూరి సత్యనారాయణ, వడ్లమూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - గోపాలపురం

ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని వెలుగు స్కూల్ ఛీఫ్ సూపరింటెండెంట్ టి.ఉమాదేవి, గౌతమి కాలేజ్ ఛీఫ్ సూపరింటెండెంట్ యువి.రమణ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. వెలుగు స్కూల్లో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు 391 మందికి 13 మంది గైర్హాజరయ్యారన్నారు. గౌతమి జూనియర్ కళాశాలలో 319 మందికి 15 మంది గైర్హాజరు అయ్యారన్నారు. గౌతమి జూనియర్ కళాశాలలో ఒకేషనల్ బ్రిడ్జి కోర్స్‌కు సంబంధించి శనివారం, సోమవారం 16,18 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చాగల్లు : చాగల్లు శ్రీ వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోశుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 224 మంది విద్యార్థులకు 223 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ పావని తెలిపారు.

గెలుపు గుర్రాలకే కూటమి టికెట్లు

కాజులూరు : గెలిచే అవకాశాలు ఉన్న వారినే అభ్యర్థులుగా ఎంపిక చేశారని టిడిపి రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపాలెం ధనమ్మ తల్లి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించి అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆర్యవటం, గొల్లపాలెంలో టిడిపి, జనసేన కార్యకర్తలు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికలో అనేక సర్వేలు నిర్వహించి గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండే సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రారంభమైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపించి భవిష్యత్తు తరాల అభివృద్ధికి నాంది పలకాలన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు

సామర్లకోట : గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులను సామర్లకోట – కాకినాడ రోడ్డులో శుక్రవారం ప్రారంభించారు. దాళ్లా వరి సాగుకు నీటి ఎద్దడి కారణంగా గోదావరి కాలువలో ఉన్న కొద్దిపాటి జలాలు గుర్రపు డెక్క, కాడ ముందుకు ప్రవహించని కారణంగా తొలగింపు పనులు ప్రారంభించారు. స్థానిక కాకినాడ రోడ్డులోని లాకుల వద్ద అధికంగా పేరుకు పోయిన కాడను జెసిబి సహాయంతో తొలగిస్తూ సాగునీటి ప్రవాహానికి అవరోధం కలగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛ భారత్

పెద్దాపురం : స్వచ్ఛ భారత్ విజయవంత మయ్యేందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. శుక్రవారం మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఇంటి వద్దా తడి – పొడి చెత్తలను వేరు చేయడమే కాక సానిటరీ సిబ్బంది వచ్చినప్పుడు వాటిని వేరువేరుగా అందజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా ప్రజారోగ్యం బాగుపడుతుందన్నారు. అనంతరం ప్రతి శుక్రవారం నిర్వహించే సంపూర్ణ పారిశుధ్య పనుల నిర్వహణలో భాగంగా 3, 14, 20, 27 వార్డుల పరిధిలో చెత్త పోగులు తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి పరిశుభ్రం చేశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

శంఖవరం, పిఠాపురం : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలని ప్రత్తిపాడు సిఐ శేఖర్ బాబు కోరారు. శంఖవరం మండలంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తింపు పొందిన పెద మల్లాపురం, శంఖవరం, కత్తిపూడి గ్రామాల్లో శుక్రవారం పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిఠాపురంలో పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్ కేంద్ర బలగాలు, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ

చాగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- చాగల్లు

ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా చాగల్లులో శుక్రవారం ఇందిరమ్మ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తాడికొండ మనోజ్‌కుమార్ గ్లకోమా గురించి వివరించారు. ఈ వ్యాధి కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాలు చచ్చుబడి పోయేలా చేస్తుందన్నారు. ఫలితంగా నెమ్మదిగా కంటిచూపు తగ్గిపోతుందన్నారు. గ్లకోమా ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనబడవన్నారు ప్రాథమిక దశలో గుర్తిస్తే కంటిచూపులు కాపాడుకోవచ్చన్నారు. వెలుతురు చుట్టూ రంగుల వలయం కనబడటం తరచూ తలనొప్పితో పాటు కళ్లు ఎర్రబడటం వాంతులు, కనుగుడ్లు నొప్పిగా ఉండటం గ్లకోమా లక్షణాలని వివరించారు.తరచుగా గ్లోకోమో పరీక్షలు చేయించుకోవడం ద్వారా దీనిని నివారించొచ్చన్నారు. 35 నుంచి 40 ఏళ్ల వయస్సున్నవారు వారు, బిపి, మధుమేహం బాధితులు, స్టెరాయిడ్స్ మందులు అధికంగా వాడేవారు, కుటుంబంలో ఎవరైనా గ్లకోమాతో బాధపడుతున్న వారు గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ పెంటపాటి గురుస్వామి, స్టాఫ్ నర్స్ ప్రదీప, హెల్త్ సూపర్‌వైజర్లు రమణమూర్తి, ఎన్ఎల్‌కె.ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

నల్లజర్ల : కంటి సమస్యలపై అశ్రద్ధ చేస్తే శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదం ఉందని కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌కె.రేష్మ అన్నారు. ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆవపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు, ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు, పారామెడికల్ ఆఫాల్మిక్ ఆఫీసర్ తగరం రాంబాబు, నల్లజర్ల మండల పరిషత్ ఉపాధ్యక్షులు అచ్యుత శివాజీ, వైసిపి నాయకులు అచ్యుత వెంకటస్వామి, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఆసరా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ లాజరస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలపై పోలీసు అధికారులు, ఆసరా ఫౌండేషన్ న్యాయవాదులు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తూ వివిధ రూపాల్లో ప్రజల నుంచి కోట్లాది రూపాయలను ఆన్‌లైన్ ద్వారా చోరీ చేస్తున్నారన్నారు. ఇప్పటికీ ఆసరా ఫౌండేషన్ ద్వారా 275 కేసులు నమోదు చేయించామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు రూ.1.50 కోట్లు ప్రజల నుంచి సైబర్ క్రైమ్ నేరస్తులు దోచుకుంటున్నారన్నారు. ఇలాంటి మోసాలకు ప్రజలు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుప్రీంకోర్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ వినియోగదారులకు ప్రత్యేక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియా నుంచి హాంగ్ సన్ యాగ్, దుబాయ్ నుంచి జహీరా సీజు బావకడన్, ఆర్‌ఆర్ టీం ఫౌండర్ రత్నరాజు, దేవరపల్లి సిఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళలకు అవార్డు లు ప్రదానం చేశారు.

'పది' పరీక్షలకు 6 కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఇఒ ఆర్.స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు, ఫ్యాన్ల సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 758 విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాల నుంచి 406 విద్యార్థులు ఈ సంవత్సరం హాజరవుతారని చెప్పారు. మొత్తం 1,164 మంది జగ్గంపేట మండలం నుంచి హాజరవుతారని ఆయన తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి

జగన్ పాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన సిఎం జగన్‌పాలనను అంతమొందించాలని టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుపార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం ఆయనకు కొవ్వూరు టికెట్‌ను కేటాయించడంతో మొదటిసారిగా శుక్రవారం కొవ్వూరు విచ్చేశారు. ఈ సందర్భంగా సినిమా థియేటర్ల సెంటర్లో ఉన్న టిడిపి కార్యాలయం వద్ద ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా సీఎం జగన్ మార్చారన్నారు. ఆయన పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనెక్కిపోయిందన్నారు. యువత నిరుద్యోగులుగా మిగిలిపోయిందన్నారు. రాష్ట్రానికి ఎటువంటి ఫ్యాక్టరీలు రాక అభివృద్ధి కుంటుపడిందన్నారు. భవిష్యత్ తరాన్ని రక్షించుకోవాలంటే చంద్రబాబు లాంటి ముఖ్య మంత్రి రాష్ట్రానికి అవసరమన్నారు. పవన్ ఆలోచనలు రాష్ట్రానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ, మాజీ అధ్యక్షులు మద్దుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు దేగల రాము, టిడిపి జిల్లా కార్యదర్శి కలగర రంగారావు తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు తొలిసారిగా విచ్చేసిన వెంకటేశ్వరరావు పట్టణంలోని వివిధ దేవాలయాలను సందర్శించారు.

కాంపిటేషన్‌లో పాల్గొన్న ఎన్‌సిసి కేడెట్లు

జిజిఎంలో ఎన్‌సిసి షూటింగ్ కాంపిటీషన్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం సమీపంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జిజియు) ప్రాంగణంలో కాకినాడ గ్రూప్ ఎన్‌సిసి–18 ఆంధ్ర బెటాలియన్ అంతర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ కాంపిటేషన్ (ఐడిఎస్ఎస్‌సి) ట్రయల్ నెంబర్–1 ఫైరింగ్ ప్రాక్టీస్ శుక్రవారం 18 ఆంధ్రా బెటాలియన్ కమాండర్ కల్నల్ సావన్ గౌడర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుబేదార్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 18 ఆంధ్ర బెటాలియన్, 3 ఆంధ్ర బాలికల బెటాలియన్, 9 ఎయిర్ స్క్వాడెన్ క్యాడెట్స్ నుంచి 103 మంది ఎన్‌సిసి విద్యార్థులు దీనికి హాజరయ్యారన్నారు. ఈ పోటీలలో ఎంపికైన వారు జాతీయస్థాయి ఎన్‌సిసి షూటింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సుబేదార్ భాస్కర్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో గైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్‌విఎస్ఎన్.మూర్తి, డీన్ డాక్టర్ టి.జయానందకుమార్, ఎన్‌సిసిఎఎన్ఒ ఎ.తేజేశ్వరరాజు, 18 ఆంధ్ర ఎన్‌సిసి .సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

సునీల్ పొడ్వాల్ అనే నేను అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో ఉన్న బివిసీ కళాశాలలో బీ.టెక్ చదివియున్నాను. అమలాపురం నుండి ప్రయాణం చేయుచూ ది. 20-2-2024 తేదీన అమలాపురం పట్టణంలో జిరాక్స్ కాపీల కోసం ఆగినప్పుడు అమలాపురంలో నా ఒరిజినల్ బి.టెక్ సర్టిఫికెట్లు పడిపోయినవి. నా ఒరిజినల్ డిగ్రీ కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, మెమరాండమ్ ఆఫ్ మార్క్స్ కలిగి ఉన్న ఫైల్‌ను నేను అమలాపురంలో పోగొట్టుకుని ఉన్నాను. వాటిపై నా పేరు సునీల్ పొడ్వాల్ S/o. రుద్రలాల్ పొడ్వాల్ అని ఉంటుంది. హాల్ టికెట్ నంబరు **11221A03A8** ఇవి ఎవరికైనా దొరికిన యెడల దయచేసి నాకు గాని, ఓడలరేవు కాలేజి యాజమాన్యానికి గాని అందజేయవలసినదిగా కోరుచున్నాను.

చిరునామా: **సునీల్ పొడ్వాల్**
తండ్రి: రుద్రలాల్ పొడ్వాల్
టాన్సెన్ 09 పాల్పా, నేపాల్
సెల్: 9235547331

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S.No.10/2022

Between:
Challa Suresh Kumar ...Plaintiff
And
Gangula Trimurthulu and Others ...Defendants

D4.Md.Khaja Mohiddin, C/o.P.Venugopala Rao, Hindu, aged 40 Yrs, Employment/Business, D.No.3-333/A, Sasikala Nagar, Morampudi, Rajahmundry Rural Mandal.
D6.M.Srinivasa Rao, C/o.Pothala venu Gopala Rao, Hindu, aged 45 Years, Business, D.No.3-333/A, Sasikala Nagar, Morampudi, Rajahmundry Rural Mandal.
D8.P.Naresh Babu, C/o.Pothala Venu Gopala Rao, Hindu, Aged 35 Yrs, D.No.3-333/A, Sasikala Nagar, Mormpudi, Rajahmundry Rural Mandal.
D9.K.Phani Kumar, C/o.Pothala Venu Gopala Rao, Hindu, Aged 46 Yrs, D.No.3-333/A, Sasikala Nagar, Morampudi, Rajahmundry Rural Mandal.
...4,6,8,9, Defendants

పై నంబరు దావాలో 4,6,8,9 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున ది.**19-3-2024** సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గానిపై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీకోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
తేది.10.3.2024 **జి.వి.రామలక్ష్మి**
అడ్వకేట్స్, రాజమండ్రి.

మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు
H.M.O.P.No. 32/2023

బిట్వీన్ :
మాణిక్యం శివశంకర్ అలియాస్ శివశంకర్ వరప్రసాద్ ....వాది
మరియు :
మాణిక్యం రామేశ్వరి ....ప్రతివాది
టు
ప్రతివాది:
మాణిక్యం రామేశ్వరి, భర్త: మాణిక్యం శివశంకర్ అలియాస్ శివశంకర్ వరప్రసాద్, వయస్సు: 24సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి. నెం. 32–2–6, రేపల్లెవాడ, కాకినాడ రూరల్, తూర్పు గోదావరి జిల్లా.

పైన తెలిపిన వాది మీ నుంచి విడాకులు పొందు నిమిత్తం పైన తెలిపిన న్యాయస్థానం యందు మీపై డైవర్స్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. అట్టి పిటిషన్‌లో మీకు పలుమార్లు కోర్టు హాజరు కావాల్సిందిగా నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నందున మీ హాజరు కొరకు **ది.01.04.2024 తేదీ**కి గౌరవ కోర్టు వారు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు మీరు స్వయంగాగాని మీ న్యాయవాది గారి ద్వారా గాని జవాబు చెప్పుటకు పైన తెలిపిన న్యాయస్థానం యందు **ఉ॥ 10.30ని॥ల**కు హాజరు కాగలరు లేని యెడల మీకు పరోక్షంగా తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

వాయిదా: 01–04–2024
//కోర్టు వారి అనుమతితో//

జనపరెడ్డి గోపీకృష్ణ
న్యాయవాది
కొత్తగూడెం
కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
12–03–2024 సెల్ నెం: **9440144978**

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం.301/2024–ఎ1 ది.12–03–2024

టెండరు కమ్ వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు 2024–25 సంవత్సరమునకు స్వాధీనము చేసిన నాటి నుండి 31–03–2025 వరకు ఆశీలు వసూలు చేసుకొనే గుత్తహక్కు నిమిత్తం ది. 20–03–2024వ తేది మధ్యాహ్నం గం॥ 1.00 సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండరు నగరపాలక సంస్థచే ప్రకటించబడిన గజిట్ నోటిఫికేషన్ నెం. 08/2023 లోని రేట్లు మరియు షరతులకు లోబడి దాఖలు చేయవలసియున్నది. టెండర్లు తెరువకుండానే టెండరుదారుల సమక్షమున అదేరోజు సాయంత్రం గం॥ 4.00 లకు కమిషనరు వారు కాని, వారిచే అనుమతి పొందిన అధికారి కాని వేలము నిర్వహించబడును. తదుపరి హాజరైన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. గుత్తదారుడు వేయు టెండర్లు / పాట మొత్తమునకు ఛార్జీలు అదనము మరియు వాటి మొత్తముపై 18% జి.ఎస్.టి. అదనము.

వ. నెం.	మార్కెట్టు పేరు	ధరావత్తు రూ.	బ్యాంకు గ్యారంటీ రెండు సంవత్సరములకు (రూ.)
1	జాంపేట మార్కెట్టు	4,00,000	2,00,000
2	జలపుష్ప భవనము (హోల్‌సేల్ చేపల మార్కెట్టు)	50,000	25,000
3	క్వారీ మార్కెట్టు	50,000	25,000
4	ఎం.ఎ. మార్కెట్టు	1,00,000	50,000

ఆసక్తి గలవారు ది. 19–03–2024వ తేది సాయంత్రం గం॥ 4.00 ల లోపు నగరపాలక సంస్థ ట్రజరీలో రూ. 200/–లు చెల్లించిన రశీదు, ధరావత్తు సొమ్ము (కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున) డిమాండ్ డ్రాఫ్ట్ మరియు నిర్దేశించిన సొమ్ముకు బ్యాంకు గ్యారంటీ సమర్పించి టెండరు షెడ్యూల్ పొందవచ్చును. ఏ కారణము తెలుపకయే టెండర్లు గాని, వేలము గాని వాయిదా వేయుటకు లేదా రద్దుపరచుటకు నగరపాలక సంస్థ కమిషనరు వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవెన్యూ ఆఫీసరు–1 గారిని సంప్రదించవచ్చును.

షరతులు:
1) వేలము నందు పాల్గొనదలచిన వారు తమ ఫోటో మరియు సంతకముతో కూడిన గుర్తింపు కార్డు అందచేసి వేలం నందు పాల్గొనవలెను. ఇతరులకు ఆథరైజేషన్ ఇచ్చుట అనివార్యమైనప్పుడు అట్టి ఆథరైజేషను నోటరీ అఫిడవిట్ ద్వారా (ఫోటో, పూర్తి చిరునామాతో సహా) సమర్పించవలెను. లేనిచో పాటదారులు మాత్రమే వేలములో పాల్గొనవలెను. ఇతరులు ఎవ్వరికీ అనుమతి లేదు.
2) టెండరు దాఖలు చేసిన వారు మాత్రమే వేలమునకు అనుమతించబడును.
3) వేలం ఖాయపరచిన తదుపరి గుత్తదారుడు 3 పోస్టుడేటెడ్స్ చెక్కులు సమర్పించవలెను.
4) వేలం ఖాయపరిచిన 7 రోజులలో గుత్తదారుడు తమ స్వంత ఖర్చులతో లీజు కాలమునకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను. లేనిచో గుత్తేదారుని దరావత్తు జమచేసుకొని లీజు రద్దు చేయబడును.
5) పై షరతులకు లోబడి బ్యాంకు గ్యారంటీ, లీజుకాలము రిజిస్ట్రేషన్ మరియు 6 నెలల అడ్వాన్సు సమర్పించిన తరువాత మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనుటకు అనుమతించబడును.
6) పాట మరియు ఛార్జీల మొత్తమునకు జి.ఎస్.టి. 18% అదనము (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారము)
7) గతములో పాడుకొని కోర్టు కేసులు ఉన్నవారు మరియు నగరపాలక సంస్థకు ఏవిధమైన బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు.

సం/– **కమిషనరు**
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

గ్రామపంచాయతీ కార్యాలయము, అర్తమూరు

టెండరు నోటీసు

ఠి.క. నెం.13/2024 తేది.16–03–2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలంలోని అర్తమూరు గ్రామపంచాయతీకి 2024–25 సం॥నకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 28–03–2024 సం॥రం తేదీ గురువారము మధ్యాహ్నం గం॥ 12.00 ల వరకు అర్తమూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00లకు అప్పటికి హాజరైన టెండరు దారుల సమక్షములో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయములు కొరకు గ్రామపంచాయతీ కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.

షెడ్యూలు

వ.నెం.	సప్లయి అయిటముల వివరము	టెండరు ధరావత్తు
1	2024–25 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామ పంచాయితీకి కావలసిన ముగ్గు, బ్లీచింగ్ మొ॥ ప్రజారోగ్య సామాన్లు సప్లయి చేయుట.	200/–
2	2024–25 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామ పంచాయితీకి కావలసిన చేతిపైపులు మరియు కుళాయి విడిభాగములు సప్లయి చేయుట.	200/–
3	2024–25 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన వీధి దీపముల విడిభాగములు మరియు క్రొత్త ఎల్.ఇ.డి. లైట్లు సప్లయి చేయుట.	200/–
4	2024–25 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన స్టేషనరీ సామాన్లు సప్లయి చేయుట.	100/–
5	2024–25 సంవత్సరమునకు గాను అర్తమూరు గ్రామపంచాయతీకి కావలసిన పారిశుద్ధ్య సిబ్బందికి కావలసిన పండుగ బట్టలు, సబ్బులు, నూనె మరియు ఇతర సేఫ్టీ కిట్స్ సప్లయి చేయుట.	100/–

శ్రీమతి గొలుగూరి అన్నపూర్ణ
సర్పంచ్, గ్రామపంచాయితీ
అర్తమూరు

సం/– **యన్.అనిల్‌కుమార్**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
అర్తమూరు, మండపేట మండలం

గ్రామపంచాయతీ కార్యాలయము, పాలతోడు

టెండరు నోటీసు

ఠి.క. నెం.8/2023 తేది.16–03–2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలంలోని పాలతోడు గ్రామపంచాయతీనకు 2024–2025 సం॥రంనకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా సామాన్లు సప్లై చేయుటకు మరియు 2024–25 నుండి రెండు సంవత్సరములకు ఆఫీస్ బాయ్ సేవలు (1), స్వీపరు సేవలు (3), వాటర్ ట్యాంకు ఆపరేటర్ సేవలు (1) వినియోగించుకొనుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 27–03–2024 సం॥రం తేదీ బుధవారం ఉదయం గం॥ 12.00ల వరకు పాలతోడు గ్రామపంచాయతీ వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు అనగా ది. 27–03–2024 మధ్యాహ్నం 02.00లకు అప్పటికి హాజరు అయిన టెండరుదారుల సమక్షమున తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయములు కొరకు గ్రామపంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.

షెడ్యూలు

వ.నెం.	అయిటముల వివరము	ధరావత్తు
1	2024–25 సంవత్సరమునకు గాను గ్రామ పంచాయితీకి కావలసిన ముగ్గు, బ్లీచింగు, ఫినాయిలు హైడ్రోక్లోరైడ్ ద్రావణము మొదలైన ప్రజారోగ్య సామాన్లు సప్లయి చేయుటకు.	200/–
2	2024–25 సంవత్సరమునకు గాను గ్రామ పంచాయితీకి కావలసిన చేతిపంపు సామాన్లు, కుళాయి సామాన్లు, ముళ్ళపారలు, డ్రైను పారలు, బేసిన్లు, చీపుర్లు, కుళాయి ట్యాప్లు మరియు OHSR వద్ద అవసరమగు సామాన్లు సప్లయి చేయుటకు.	200/–
3	2024–25 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన స్టేషనరీ సామాన్లు సప్లయి చేయుటకు.	100/–
4	2024–25 నుండి రెండు సంవత్సరములకు ఆఫీస్ బాయ్ సేవలు (1), స్వీపరు సేవలు (3), వాటర్ ట్యాంకు ఆపరేటరు సేవలు (1) వినియోగించుకొనుటకు	100/–

సం/– **పిల్లా వెంకటలక్ష్మి**
సర్పంచ్, గ్రామపంచాయితీ
పాలతోడు

సం/– **యన్.వి.రామారెడ్డి**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
పాలతోడు, మండపేట మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా